బతుకులు మార్చినబడి..
పాతబడింది

- శిథిలావస్థకు చేరుకున్న కొత్తపల్లె మెయిన్ పాఠశాల
- గొప్ప సంకల్పంతో ఏర్పాటైన ప్రాథమిక పాఠశాల
- ప్రభుత్వం భవనాలు నిర్మిస్తే సహకారం అందిస్తామంటున్న పూర్వ విద్యార్థులు


శిథిలావస్థలో కొత్తపల్లిలోని జోరుపల్లి వెంకటసుబ్బారెడ్డి మెయిన్ పాఠశాల

పెనగలూరు : ఆ పాఠశాల నాడు విద్యార్థులతో కళకళలాడేది. చదువుల నిలయంగా.. విద్యను పంచే దేవాలయంగా కొత్తపల్లి మెయిన్ పాఠశాలకు పేరు. 1972లో ప్రారంభమైన ఆ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు బోధన చేసేవారు. 380 మంది విద్యార్థులు, ఎనిమిది మంది ఉపాధ్యాయులకు తగ్గకుండా ఆ చిన్ని పాఠశాల బోధనాలయంగా పేరొందిన పాఠశాల నేడు అధ్వాన స్థితికి చేరుకొంది. ఎంతో మందికి బంగారు భవిష్యత్తును అందించిన ఆ పాఠశాలను బాగు చేసే నాథుడు లేక చివరికి శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం 40 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అవస్థల వాసమై.. చదువు చెప్పేందుకు యోగ్యత లేని భవనం కళ్లముందు దర్శనమిస్తుంది. 40 ఏళ్లకు పైగా విద్యాబుద్ధులు అందిస్తూ పిల్లలను తన ఒడిలో ఉంచుకొని ఎదిగేలా చేసిన ఆ ప్రాథమిక పాఠశాల బాగు చేసేవారు రాకపోతారా అంటూ ఆవేదన తెలుపుతోంది. లేకుంటే తాను పాడుబడ్డ గోడలుగా.. పెచ్చులూడుతున్న బడిగా మారుతోంది. బడిలో ఓనమాలు నేర్చి బాగుపడిన ఎందరినో సమాజానికి అందించిన ఆ బడి నేడు శిథిలావస్థకు చేరుకొని దీనస్థితిలో కనిపిస్తోంది. ఎవరో ఒకరు రాకపోరు.. బాగు చేయకపోరు అని దీనంగా ఎదురుచూస్తోంది.

అప్పుడు చదివిన వారు..
ఇప్పుడు సమాజంలో ఉన్నతస్థితిలో..

యాభై ఏళ్ల పాటు తన ఒడిలో ఓనమాలు నేర్పిన విద్యార్థులు నేడు సమాజంలో ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారు. ఏమీ తెలియని వయసులో పాఠశాల ఆవరణలో ఆటలు ఆడుకుంటూ.. దెబ్బలాడుతూ.. ముచ్చట్లు చెప్పుకుంటూ సరదాగా గడిపారు. అలా ఈ బడి ఒడిలో పెరిగిన కొందరు ప్రభుత్వ కొలువులతోపాటు వైద్యులుగా, ఇంజనీర్లుగా, విదేశాల్లోనూ వివిధ స్థాయిల్లో రాణిస్తున్నారు. ఎందరినో ప్రయోజకులుగా చేసిన ఆ ప్రాథమిక పాఠశాల నేడు కళావిహీనంగా మారింది. శిథిలావస్థకు చేరుకుంటున్న ఆ పాఠశాల ఈ రోజు బాగు చేయరు అని ఆవేదనతో అడుగుతోంది. అధికారులు కాస్తయినా కనికరించరూ అని బతిమాలుతోంది.

ప్రస్తుతం నలభై మంది విద్యార్థులు..

పూర్వ వైభవం కోసం ఎదురు చూస్తున్న ఆ బడిలో ప్రస్తుతం కేవలం 40 మంది విద్యార్థులే ఉన్నారు.


శిథిలమైన గది ఫ్లోరింగ్

ఇందులో ఒక కారణం పాఠశాల భవనం స్థితిని చూసిన తల్లిదండ్రులు తమ పిల్లలను బడి చేర్చేందుకు జంకుతున్నారు. ఎప్పుడు ఏ పెచ్చులూడి తమ పిల్లల మీద పడుతుందోనన్న భయం వారిలో కనిపిస్తోంది. ఇప్పుడు విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న వారిని భవనం స్థితిని చూసి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియకపోవడంతో కొత్తపల్లెలోని ఉర్దూ పాఠశాలలో తరగతి గదులు నిర్వహిస్తున్నారు. యాభై ఏళ్ల పాటు వందలాది విద్యార్థులకు భవితను అందించిన ఆ పాఠశాల స్థితి బాగుపడేలా అటు అధికారులు.. ఇటు పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.


పాఠశాలలో పెచ్చులు ఊడి పడిన స్లాబ్

ఎనిమిది మంది ఉపాధ్యాయులము విద్యాబోధన చేసేవారం..



పాఠశాలలో విద్యార్థులు అత్యధికంగా ఉండటంతో గతంలో జిల్లా అధికారులు ఈ పాఠశాలకు ఎనిమిది మంది ఉపాధ్యాయులను నియమించారు. నేను ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తూ విద్యార్థులకు ఉన్నతమైన విద్యను గతంలో ఉపాధ్యాయులందరం కలిసి బోధించేవారం. భవనం శిథిలావస్థకు చేరడంతో ఇక్కడ విద్యార్థులు నానాటికి తగ్గిపోయారు.

- తలమంచి గోపాల్ రెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు, ఎంపీపీ పాఠశాల, కొత్తపల్లి, పెనగలూరు

పాఠశాల అంటే ఎంతో అభిమానం



కొత్తపల్లి పాఠశాలలో చదివి ఉన్నత ఉద్యోగం సంపాదించడం వల్ల ఈ పాఠశాల అంటే మాకు ఇప్పటికీ ఎంతో గౌరవం. మిలటరీలో ఉన్నత ఉద్యోగం చేస్తున్నానంటే చిన్నతనంలో మాస్టర్లు చెప్పిన విద్యాబోధనే కారణం. పాఠశాలలో చదివిన రోజులు.. ఆడుకున్న ఆటలు ఎప్పటికీ మరువలేను. ఇక్కడ చదువుకున్న వారము వివిధ స్థాయిల్లో స్థిరపడ్డాం. పాఠశాలకు ఎంతో రుణపడి ఉంటాం.

- బి.జనార్దన్ రెడ్డి, గ్రేహౌండ్స్, ఏఎస్పీ, కొత్తపల్లి, పెనగలూరు

ప్రభుత్వం సహకరిస్తే పూర్వ వైభవం తీసుకొస్తాం



వందలాది మందికి విద్యను అందించిన పాఠశాల నేడు శిథిలావస్థకు చేరుకోవడం బాధాకరం. కొత్తపల్లి మెయిన్ పాఠశాలకు నూతన బిల్డింగ్‌లు ప్రభుత్వం నిర్మించినట్లయితే పాఠశాల పూర్వ వైభవం సంతరించేందుకు తమవంతు కృషి చేస్తాం. విద్యార్థులను ఇక్కడే చేర్పించే విధంగా గ్రామంలో ప్రచారం కూడా నిర్వహిస్తాం. ప్రభుత్వం నూతన బిల్డింగ్‌లను నిర్మించాలి.

- ప్రసాద్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, కొత్తపల్లి, పెనగలూరు

పాఠశాలకు మావంతు సహకారం



కొత్తపల్లి మెయిన్ పాఠశాలకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు తమవంతు సహాయ సహకారాలు కూడా అందిస్తాం. ఇక్కడ ఈ పాఠశాలలో చదవడం వల్లనే ఎస్ఆర్ఐగా ఇతర దేశాలలో స్థిరపడటం జరిగింది. అందుకే పాత జ్ఞాపకాల కోసం పాఠశాల అభివృద్ధికి నా వంతు సహకారం అందిస్తా. ప్రభుత్వం పాఠశాలను బాగు చేయడానికి అధికారులు ముందుకురావాలి.

- మధుసూదన్ రెడ్డి, ఎన్ఆర్ఐ, కొత్తపల్లి మండలం

క్లుప్తంగా

18, 19న క్రీడా పోటీలు

చిట్వేలి : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు సూచించారు. ఈనెల 18, 19వ తేదీలలో జరగనున్న మండల స్థాయి క్రీడా పోటీలకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ 14, అండర్ 17 విభాగాలలో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే కేజీబీవీలు, ఏపీ మోడల్ స్కూల్‌లో, హైస్కూల్ ప్లస్‌లలో చదివే ఇంటర్ విద్యార్థులు నేరుగా జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. పూర్తి వివరాలుకు 99661 73441 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

27 చెరువులకు వెలిగల్లు నీళ్లు

గాలివీడు : వెలిగల్లు ప్రాజెక్ట్ కుడికాలువ ద్వారా ఇప్పటివరకు 27 చెరువులు, కుంటలను నీటితో నింపినట్లు ఏఈ సాంబశివుడు పేర్కొన్నారు. ప్రస్తుతం జలాశయంలో 2.37 టీఎంసీల నీరు నిల్వ వున్నట్లు తెలిపారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి 32.8 మి.మీ. వర్షపాతం నమోదు కాగా ఇన్ ఫ్లో నమోదు లేదు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుడికాలువ ద్వారా ఇప్పటివరకు 45 కిలో మీటర్ల వరకు ప్రవాహంతో చెరువులు, కుంటలను నీటితో నింపామని, సుదూర చెరువులను కూడా నీటితో నింపిన తరువాత కుడి కాలువ ప్రవాహాన్ని నిలిపివేస్తామన్నారు.

ప్రమాదకరంగా ఉపరితల జలాశయం



ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని ఉపరితల జలాశయం ప్రమాదకరంగా మారింది. దశాబ్దాలుగా ఊపరితల జలాశయం నిరుపయోగంగా ఉంది. పట్టణ నడిబొడ్డున నివాసాల మధ్య ఉండటం, ఆపై పెచ్చులూడి పడుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందోనని ప్రజలు అటు వైపు వెళ్లడానికే జంకుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

వైభవంగా పల్లకి సేవ

పెనగలూరు : మండల కేంద్రం పరిధి ఇండ్లూరు గ్రామంలో బుధవారం రాత్రి వినాయకుని పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. సంకటహర చతుర్థి సందర్భంగా వినాయక ఆలయంలో బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలోని నాలుగు వీధులలో వినాయకుడు సిద్ది బుద్ధిల్‌లు ఉత్సవ విగ్రహాలతో పల్లకీ సేవా నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రమాణస్వీకారం చేసిన మార్కెట్ చైర్మన్‌లు


ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, సభ్యులు

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి, లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని రాయచోటి మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించారు. గురువారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి రాష్ట్ర మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సత్యకుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బోడిరెడ్డి (అనుంపల్లి) రాంప్రసాద్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎస్ఎండీ షఫీనాయక్‌లు, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లా బాబు, కూటమి నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు అవకాశాలు

రైల్వేకోడూరు అర్బన్ : ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో యువతకు మంచి అవకాశాలు ఉంటాయని వెలుగు ఏపీఎం వసుంధర గురువారం తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌కు మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి వ్యాపార ప్రణాళిక, అవగాహనతో ముందుకు వస్తే ప్రభుత్వం ప్రోత్సాహకాలతో యువతకు బాసటగా ఉంటుందని చెప్పారు.

కుల ధృవీకరణ పత్రాల నమోదుకు సహకరించాలి

సుండుపల్లె : మండల వ్యాప్తంగా ఉన్న ప్రతి కుటుంబసభ్యులు సుమోటో కుల ధృవీకరణ పత్రాల నమోదుకు వివరాలు తెలియజేయాలని తహసీల్దార్ మహబూబ్‌చాంద్ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ కుల ధృవీకరణకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు వివరాలు తెలియజేసిన వారికి ఉచితంగా కుల ధృవీకరణ పత్రాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. అలాగే ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న అధికారులకు ప్రజలు వివరాలను తెలియజేయాలని చెప్పారు. మండల కేంద్రంలో వీఆర్‌ఓ బసయ్య, సర్వే వీఆర్‌ఏ రమణ ముమ్మరంగా సర్వే చేస్తున్నారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి


రాజంపేట టౌన్: నిరసన వ్యక్తం చేస్తున్న టీచర్లు

రాజంపేట టౌన్ : కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరం ప్రతినిధులు డిమాండ్ చేశారు. పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ పీరుమున్నికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీలో నూతన పెన్షన్ (సీపీఎస్) విధానం 2004 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చిందన్నారు. అయితే అంతకుముందు ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగ నియామక నోటిఫికేషన్లకు సీపీఎస్ వర్తించదన్నారు. అందువల్ల కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బిల్లా హరిప్రసాద్, 2003 డీఎస్సీ కన్వీనర్ ఉదయ్ భాస్కర్, మాధవ మూర్తి, రామకృష్ణ, శంకర్ నాయక్, నారాయణరెడ్డి, మహేష్‌నాయుడు, శ్రీనివాసులు, శ్రీనివాసరాజు, సోమేశ్వర్ పాల్గొన్నారు.

పునరుద్ధరించే దాకా పోరాటం

సిద్ధవటం : కేంద్ర ప్రభుత్వం మెమో. 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు ఫోరం జిల్లా కన్వీనర్ వీర ప్రతాప్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన సిద్ధవటం తాలుకా కేంద్రం వద్ద గురువారం సాయంత్రం పెద్దఎత్తున ఉపాధ్యాయులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ 2003 ఫోరం, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘ నాయకుల పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం మెమో 57 అనుసరించి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పెన్షన్ సాధనకై రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు సిద్ధవటం తాలుకా కేంద్రం వద్ద ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, ఫోరం నాయకులు రవి, ఓబులేశు, మణి కుమార్, సోమశేఖర్, చంద్రమోహన్ రెడ్డి, నరసింహులు, రామకేశవులు, కడప జిల్లా బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి హిర, కొండయ్య, ఉద్యోగ ఉపాధ్యాయులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

యూరియా మంజూరు

సిద్ధవటం : మండలానికి 19.8 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరైనట్లు సిద్ధవటం వ్యవసాయశాఖ అధికారి రమేష్ రెడ్డి తెలిపారు. టక్కోలు రైతు సేవా కేంద్రానికి 9.9 మెట్రిక్ టన్నులు, సిద్ధవటం రైతు సేవా కేంద్రానికి 9.9 మెట్రిక్ టన్నులు యూరియా రావడం జరిగిందని చెప్పారు. యూరియా కావాల్సిన రైతులు సరైన ధృవపత్రాలు చూపించి యూరియా తీసుకోవాలని తెలియజేశారు.

లిల్లా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే



లక్కిరెడ్డిపల్లి : మండలంలోని మైనార్టీ నాయకులు మహమ్మద్ షరీఫ్ లిల్లా కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే రెడ్డప్పగారి రమేష్ కుమార్ రెడ్డి, అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు, మండల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డిలు హాజరయ్యారు. వీరితోపాటు మైనార్టీ నాయకులు మహమ్మద్ అలీ, చాన్ బాషా, సాహెబ్, అరవ్ జాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీధర్ రెడ్డి, రవిరెడ్డి, నాగేంద్ర బాబు, దిలీప్ రాజు, వినయ్ కుమార్ రెడ్డి, సభాపతి నాయుడు, అర్షద్, జావేద్, అల్తాఫ్, వాలిద్, దర్బార్, నవాజ్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

మేదర్ల సమస్యలు పరిష్కరించండి

రాయచోటి టౌన్ : మేదర్ల సమస్యలను పరిష్కరించాలని రాయచోటి మహేంద్ర (మేదర) సంఘం నాయకులు ఆరోగ్యశాఖ మంత్రి కోరారు. గురువారం రాయచోటికి వచ్చిన సందర్భంగా వారు వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ మేదరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, కులవృత్తిలో స్థిరపడ్డ వారు ఆరోగ్య ఇబ్బందులు ఎదుర్కొంటున్న కారణంగా 50 ఏళ్లకే పింఛన్ అందించాలని, అటవీ ప్రాంతంలో ఉండే వెదురుపై పూర్తి హక్కులు కేటాయించాలని, భూమి లేని వారికి భూమిని కేటాయించి వెదురు పెంపకం కోసం రుణాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో గజపనేని వెంకట సుబ్బయ్య, టంగుటూరు నాగార్జున, ఆర్ల నరసింహులు, గజపనేని వెంకట జయప్రసాద్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

రాయచోటి జగదాంబసెంటర్ : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిస్కం అధ్యక్షులు సుబ్రమణ్యంరాజు ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2022 పీఆర్‌సీ ప్రకారం రావాల్సిన అరియర్స్ చెల్లించి సర్వీస్ ఇంక్రిమెంట్‌ను ఇవ్వాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ఉద్యోగులుగా గుర్తించండి

రాజంపేట రూరల్ : అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా కూటమి ప్రభుత్వం గుర్తించాలని సీఐటీయూజిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో గురువారం అంగనవాడీ ప్రాజెక్టు అధ్యక్షులు ఎం.విజయమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.శ్రీలక్ష్మిలు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్‌లను 3వ తరగతి ఉద్యోగులుగా, ఆయాలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. గుజరాత్‌లో వలే వర్కర్‌కు రూ.24,800లు, ఆయాకు రూ.20,300 వేతనం ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి 14 నెలలు అయినా వేతనాలు పెంచలేదన్నారు. మినీ వర్కర్‌లు మెయిన్ వర్కర్‌లుగా మార్చిన స్థానంలో ఖాళీగా ఉన్న 5వేల ఆయా పోస్టులు భర్తీ చేయాలన్నారు. సంక్షేమ పథకాలు అంగన్‌వాడీలకు వర్తింపజేయాలని కోరారు. సెంటర్‌లకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి ఎం.ఈశ్వరమ్మ, సభ్యులు అమరావతి, శివరంజని, శివజ్యోత్స్న, సుస్మిత, ఇందిరమ్మ, అనురాధ, విజయలక్ష్మి, ఉమాదేవి, నాగరత్న, మమతా, తులసీ, అరుణమ్మ, లక్ష్మిదేవి, సుజాత, ప్రతిమ, వనిత, స్వర్ణ, వరలక్ష్మి, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


పంటలను పరిశీలిస్తున్న డీపీఎం వెంకటమోహన్

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.వెంకటమోహన్ పేర్కొన్నారు. గురువారం రాయచోటి మండల పరిధిలోని గొర్లముదివీడు, ఎండపల్లి గ్రామాల్లో రైతులు వేసిన పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ అనుసంధాన పంట సాగు చేయడం ద్వారా భూసారం మెరుగుపడుతుందని తెలిపారు. అలాగే ప్రధాన పంట నష్టపోయిన సందర్భాల్లో రైతులకు ఆదాయ నష్టం తగ్గుతుందని వివరించారు. అనంతరం బీజామృతం వినియోగంపై ప్రదర్శన నిర్వహించి, విత్తన శుద్ధి చేయడం వల్ల మొలక శాతం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జేడీఏ శివనారాయణ, ఏడీఏ స్వాతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


రాజుకుంటలో అవగాహన సదస్సు

చిట్వేలి : మండల పరిధిలోని రాజుకుంటలో గురువారం నానో ఎరువులు, జీవన ఎరువులు, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ సుధాకర్ మాట్లాడుతూ రైతులు కేవలం రసాయన ఎరువులను కాకుండా సేంద్రియ, పచ్చరొట్ట, జీవన ఎరువులను వాడినప్పుడే పర్యావరణాన్ని కాపాడుతూ మంచి దిగుబడులను పొందవచ్చని తెలియజేశారు. నానో యూరియా, నానా డీఏపీలను వాడటం ద్వారా ఎరువులను వృథా చేయకుండా అరికట్టవచ్చన్నారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి

సుండుపల్లె : రైతులు యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని మండల వ్యవసాయాధికారి మహబూబ్ బాషా తెలిపారు. గురువారం మండల పరిధిలోని జి.రెడ్డివారిపల్లి, భాగంపల్లి గ్రామాల్లో యూరియా పైన రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మెహబూబ్‌చాంద్, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆలయంలో ఎంపీ మిథున్‌రెడ్డి పుట్టినరోజు వేడుక


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నాయకులు


ఓబులవారిపల్లె : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మంగంపేట సమీపంలోని అనంతరాజుపేట సాయిబాబా దేవాలయం నందు డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ పేరు మీద ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. అలానే కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో పంజం వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీటీసీ మల్లి, సర్పంచ్‌లు హరికృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, రమణ, జిల్లా కో–ఆప్షన్ సభ్యులు అన్వర్ బాషా, మణి, షఫీ, తోట శివసాయి, రఫీ, కరీముల్లా, పవన్, ఇర్ఫాన్, మణి, అజాం, శ్రీను, గుణిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

లక్కిరెడ్డిపల్లి : వెలిగల్లు నీటితో లక్కిరెడ్డిపల్లి టౌన్ తాగునీటి ఇక్కట్లను పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం 2, 3 వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఏళ్లుగా వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం మూడు మండలాల్లోని అన్ని గ్రామాలకు తాగునీరుతోపాటు 24 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. కానీ అది ఇప్పటి వరకు ఆచరణలో సాధ్యం కాలేదన్నారు. కావున నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్న అన్ని గ్రామాలకు వెలిగల్లు నీటితో శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ లక్కిరెడ్డిపల్లి మండల కార్యదర్శి ఓబులేశు, సహాయ కార్యదర్శి వీరాంజనేయులు పాల్గొన్నారు.

జ్వరాలు.. వైరల్

- రోగులతో కిక్కిరిసిన సర్కార్ దవాఖానా
- జ్వర పీడితులతో అమాంతం పెరిగిన ఓపీ
- రోగులను వేధిస్తున్న మందుల కొరత
- ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీతో జనం జేబులు గుల్ల


వైద్య పరీక్షలకు రక్తాన్ని సేకరిస్తున్న టెక్నీషియన్లు


ఓపీ టోకెన్ కోసం జ్వరపీడితులతో కిక్కిరిసి కనిపిస్తున్న ఆస్పత్రి

రాయచోటి టౌన్ : ఉన్నపళంగా ఒళ్లంతా నొప్పులు ఆపై వాంతులు తలంతా భారంగా నొప్పిగా అనిపిస్తూ.. ఉండగానే విపరీతమైన జ్వరంతో అల్లాడుతున్నారు ప్రజలు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా విషజ్వరాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. వణికిపోతున్న జ్వరాలతో వస్తున్న రోగులతో రాయచోటి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో అయితే పేదలు క్యూ కడుతున్నారు. వచ్చిన వారిలో సగానికి పైగా రక్తపరీక్ష కోసం డాక్టర్లు రెఫర్ చేస్తే అందులో సగం మందికి విషజ్వరం సోకినట్లుగా టెక్నీషియన్లు నిర్ధారిస్తున్నారు. జ్వరాలు వచ్చిన రోగులకు డాక్టర్లు మందు బిళ్లలు రాసి పంపుతుండగా మరి కొందరికి సెలైన్లు పెట్టి పంపుతున్నారు. అయినా వారం నుంచి పది రోజుల వరకు ఈ విషజ్వరాలు తగ్గడం లేదని రోగులు వాపోతున్నారు. తద్వారా చికిత్సలు, పరీక్షలు, స్కానింగ్‌ల పేరుతో వేలకువేల రూపాయలు లూటీ చేస్తున్నారు.

పెరుగుతున్న రోగుల సంఖ్య..

జ్వరాల సీజన్ ప్రారంభం కావడంతో రోజురోజుకి జ్వర పీడితుల సంఖ్య పెరిగిపోతోంది. గతంలో రాయచోటి పెద్దాసుపత్రికి రోగులు 500 – 600 మంది వరకు వచ్చే రోగుల సంఖ్య ప్రస్తుతం 800 – 900 మంది వరకు రోగులు వస్తున్నారు. వీరిలో ఎక్కువ శాతం జ్వరంతో బాధపడుతున్న వారు అధికంగా ఉండటం విశేషం. వీరిలో వారి శరీరం బలహీనతను బట్టి వైద్యులు కూడా రక్త పరీక్ష కోసం పంపిస్తుండగా వారిలో 90 శాతం మంది విషజ్వరాలు సోకినట్లుగా నిర్ధారణవుతోంది. కాగా జ్వరాల బారిన పడి ఆస్పత్రికి వస్తున్న రోగులకు అక్కడ దోమల బెడదను చూసి మరింత బెంబేలెత్తిపోతున్నారు. దీనికి తోడు ఆస్పత్రిలో మందుల కొరత వేధిస్తోంది. వచ్చిన రోగులకు వైద్యులు రాసిన దానికంటే తక్కువ మందులు అందించి పంపుతున్నారు.

రోగుల బాధ వర్ణణాతీతం

జ్వరంతో వస్తున్న రోగుల బాధ వర్ణణాతీతంగా ఉంది. విపరీతమైన తలనొప్పి, తల బరువెక్కటం, బలహీనంగా ఉండటం, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలతో ఆస్పత్రికి వస్తున్నారు. వీరికి వైద్యులు మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి జ్వరాలు ఏమైనా సోకి ఉంటాయని భావించి రక్తపరీక్షలు, స్కానింగ్, గళ్ల పరీక్షలకు రాస్తున్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న వారి జేబులు గుల్లవుతున్నాయి.

పరీక్షల కోసం బారులు

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతి రాయచోటిలో వివిధ ఆస్పత్రులకు దాదాపు 1200 మంది రోగులు వస్తున్నారు. దీంతో ఆస్పత్రులు రోగులు వారి సహాయకులతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి. పరీక్షల కోసం అటు డయాగ్నస్టిక్ సెంటర్‌లకు చికిత్సకు ఇటు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లిన వారికి వివిధ పరీక్షలు, చికిత్స, మాత్రలు ఇలా ఒకసారి వైద్యుడు దగ్గర పోయి వచ్చే సారికి రూ.3000 దాకా ఖర్చు అవుతున్నట్లు పలువురు తెలియజేశారు.


రోగులకు మందులు అందిస్తున్న సిబ్బంది

నాణ్యమైన వైద్యం అందిస్తున్నాం



ఆస్పత్రికి వచ్చిన రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నాం. అంతే కాకుండా వచ్చే వాటిలో ఎక్కువగా విషజ్వరాలు కాబట్టి వారికి మందులు అందివ్వడమే కాకుండా అవసరం మేరకు సెలైన్లు కూడా పెట్టి జబ్బును నయం చేస్తున్నాము. విసజ్వరాలపై కొన్ని అపోహలు ఉన్నాయి. అయితే వాటిని నమ్మాల్సిన అవసరం లేదు.మంచి మందులు ఉన్నాయి. ఎలాంటి పరిస్థితులలో అయినా ఆస్పత్రికి రావొచ్చు. తమ సిబ్బంది వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటారు.

– డాక్టర్ డేవిడ్ సుకుమార్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, రాయచోటి